క్లుప్తంగా

నైపుణ్యాలపై సదస్సు రేపు

సీతంపేట: వికసిత్ భారత్ దిశగా విద్యార్థులకు కావాల్సిన నైపుణ్యాలు, చదువులు, డ్రగ్స్ మహమ్మారి, టెక్నాలజీ తదితర విషయాలపై ఈ నెల 7వ తేదీ ఉదయం 10 గంటలకు అక్కయ్యపాలెం హైవే బస్టాప్ ఎదురుగా ఉన్న జీఎస్టీ కస్టమ్స్ నార్కోటిక్స్ అకాడమీ(నాసిన్)లో అవగాహన సదస్సు జరుగుతుందని బాల వికాస్ ఫౌండేషన్ గౌరవ కార్యదర్శి నరవ ప్రకాశరావు ఒక ప్రకటనలో తెలిపారు. సీనియర్ ఐఆర్ఎస్ అధికారి, నాసిన్ డైరెక్టర్ ఈదర రవికిరణ్ ముఖ్య వక్తగా ప్రసంగిస్తారని చెప్పారు. పాఠశాల, కళాశాలల విద్యార్థులు పాల్గొని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

మద్దిలపాలెం: జోన్- 2 ఎన్ఎస్‌టీఎల్ సబ్ స్టేషన్ పరిధిలో నిర్వహణ పనుల నిమిత్తం శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ బీకే నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. కాకానినగర్, మాధవధార ఫీడర్ల మరమ్మతుల నిమిత్తం ఎస్‌వీకే నగర్, రెల్లి వీధి, విమాన్‌నగర్, వినోద్‌నగర్, కాకానినగర్, సాకేతపురం, మాధవధార పరిసర ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించాలని కోరారు.

తాజా కూరగాయలు విక్రయించండి

సీతంపేట: జిల్లా వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ వైస్ చైర్మన్ చంద్రశేఖర్, డైరెక్టర్లు తమ్మినేని పద్మజ, లలిత గురువారం నరసింహనగర్ రైతుబజార్‌లో పర్యటించారు. అక్కడ రైతులు, వినియోగదారులతో మాట్లాడి సమస్యలు, వసతుల గురించి తెలుసుకున్నారు. తాజా కూరగాయలు విక్రయించాలని, వినియోగదారులతో మర్యాదపూర్వకంగా మెలగాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో ఈవో కొండబాబు, సహాయకుడు సత్యనారాయణ పాల్గొన్నారు.

ఎట్టకేలకు డివైడర్‌పై గొయ్యి పూడ్చివేత



స్వర్ణభారతి స్టేడియం వద్ద రోడ్డు డివైడర్‌పై పూడ్చిన గొయ్యి

సాక్షి ఎఫెక్ట్..

సీతంపేట: స్వర్ణభారతి స్టేడియం సమీపంలో స్పెన్సర్స్ మాల్ ఎదురుగా రహదారి మధ్యలో డివైడర్‌పై తవ్వి వదిలేసిన గొయ్యిని ఎట్టకేలకు జీవీఎంసీ సిబ్బంది పూడ్చారు. ఈ గొయ్యి ప్రమాదకరంగా ఉండటంతో ఏడాదిన్నర కాలంగా స్థానికులు, పాదచారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యపై మే 31న 'ప్రమాదకరంగా గొయ్యి' అనే శీర్షికన 'సాక్షి'లో ప్రచురించిన వార్తకు జీవీఎంసీ అధికారులు స్పందించారు. రెండు రోజుల కిందట గొయ్యి పూడ్చివేశారు. సమస్య పరిష్కారం కావడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

ఐఐఏఎంలో ఎన్ఈపీపై వర్క్‌షాప్



వర్క్‌షాప్‌లో పాల్గొన్న అతిథులు, అధ్యాపకులు

ఎంవీపీకాలనీ: ఎంవీపీలోని ఇంటిగ్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ మేనేజ్‌మెంట్(ఐఐఏఎం) బీ స్కూల్‌లో గురువారం నేషనల్ ఎడ్యుకేషనల్ పాలసీ(ఎన్ఈపీ–2020)పై వర్క్‌షాప్ నిర్వహించారు. ఉన్నత విద్యా సంస్థలకు బోధనా పద్ధతులు అనే అంశంపై కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎన్ఈపీ–2020 పాలసీని అర్థం చేసుకోవడం, కేంద్రీకృత బోధనా విధానాలు, విద్యార్థుల్లో సృజనాత్మక పెంపొందించడం, అంతర్జాతీయ అవసరాలకు అనుగుణంగా విద్యార్థుల సన్నద్ధత, బోధనా ప్రమాణాల మెరుగును వక్తలు సభ్యులకు వివరించారు. ఈ పాలసీ ద్వారా నూతన ఆధునిక పద్ధతులు అందిపుచ్చుకోవాల్సిన అవసరాన్ని వివరించారు. ఈ విధానంలో అధ్యాపకులకు ఎదురయ్యే సవాళ్లు, పరిష్కార మార్గాలపై చర్చించారు. కార్యక్రమంలో ఐఐఏఎం బీ స్కూల్ డీన్ డాక్టర్ ఎస్.పి.రవీంద్ర, ఏయూ మాజీ రిజిస్ట్రార్ ఆచార్య కృష్ణమోహన్, ఏఎన్‌యూ మాజీ వీసీ ఆచార్య బాలమోహన్‌దాస్ తదితరులు పాల్గొన్నారు. వివిధ జిల్లాల నుంచి విద్యా సంస్థల అధ్యాపకులు హాజరయ్యారు.

పర్యావరణాన్ని కాపాడుకుందాం



రైల్వే కాలనీలో మొక్కలు నాటుతున్న ఏడీఆర్ఎం, రైల్వే అధికారులు



వాకర్స్ పార్కులో మొక్కలు నాటుతున్న జోనల్ కమిషనర్ రాము



కార్యాలయ ఆవరణలో మొక్క నాటి నీరు పోస్తున్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు



గాంధీనగర్ అంగన్‌వాడీ కేంద్రంలో పర్యావరణ చిత్రాలను ప్రదర్శిస్తున్న సిబ్బంది, చిన్నారులు



అవగాహన ర్యాలీ చేస్తున్న బుల్లయ్య కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు



నేత్ర వైద్యశాలలో మొక్క నాటుతున్న ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు



గైస్ ఆవరణలో మొక్క నాటుతున్న ప్రిన్సిపాల్ రమణ తదితరులు

- ప్రపంచ పర్యావరణ దినోత్సవంలో వక్తలు
- ఉత్సాహంగా.. మొక్కలు నాటే కార్యక్రమాలు

సీతంపేట: పర్యావరణాన్ని రక్షించుకోవడం అందరి బాధ్యతని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గురువారం మొక్కలు నాటే కార్యక్రమాలను ఉత్సాహంగా నిర్వహించారు. రేసపువానిపాలెంలోని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి కార్యాలయ ఆవరణలో డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది పర్యావరణ దినోత్సవ థీమ్ 'బీట్ ప్లాస్టిక్ పొల్యూషన్' అనే ప్రచారంతో ప్లాస్టిక్ కాలుష్య నియంత్రణపై దృష్టి పెడతామన్నారు. ఈ ఏడాది మనం 50వ పర్యావరణ దినోత్సవం నిర్వహించామని, ప్రపంచ దేశాలన్నీ పర్యావరణ పరిరక్షణ గురించి మాట్లాడుతాయని, భూమికి సంభవించే రకరకాల కాలుష్యాలను ఎలా తగ్గించాలో చర్చిస్తాయని, తీర్మానాలు చేస్తాయని తెలిపారు. కాలుష్యం వల్ల అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయన్నారు. పర్యావరణం గురించి మాట్లాడటమే కాకుండా పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ హారిక, కార్యాలయ సిబ్బంది, ఎన్సీడీ స్టాఫ్ పాల్గొన్నారు.

అవగాహన ర్యాలీ

లంకపల్లి బుల్లయ్య ఇంజినీరింగ్ కాలేజీ ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో కళాశాలలో నవ సంరక్షణ కార్యక్రమం చేపట్టారు. కళాశాల ఆవరణలో పెద్ద సంఖ్యలో మొక్కలు నాటారు. వివిధ విభాగాల అధిపతులు, విద్యార్థులు మొక్కలు నాటారు. అనంతరం ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పర్యావరణ పరిరక్షణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డి.దీపక్ చౌదరి, ఎన్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ బి.సతీష్ నాయుడు పాల్గొన్నారు.

యువత మొక్కలు నాటాలి

రామాటాకీస్ రోడ్డులోని ప్రభుత్వ ప్రాంతీయ నేత్ర వైద్యశాలలో ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజు మొక్క నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖను కాలుష్య రహిత నగరంగా తీర్చిదిద్దడానికి యువత నడుం బిగించి గడపగడపలో అమ్మ పేరుతో మొక్కను నాటి ప్రధాని మోదీ ఆశయాన్ని నెరవేర్చాలన్నారు. కార్యక్రమంలో నేత్ర వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ వి.మీనాక్షి, బీజేపీ వైద్య విభాగం కన్వీనర్ రూపాకుల రవికుమార్, జీవీఎంసీ పీడీ డాక్టర్ శ్రీనివాస రాజమణి, వైద్యులు జ్యోతిర్మయి, వి.రమణ, ప్రేమలత పాల్గొన్నారు.

సామాజిక బాధ్యత

ద్వారకానగర్ బీవీకే కాలేజీలో ఎన్ఎస్ఎస్, ఏజీఎస్ ఐటీసీ వావ్ ఆర్గనైజేషన్ సంయుక్తంగా అవగాహన సదస్సు నిర్వహించాయి. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్స్, పద్మజ, రత్నశేఖర్ మాట్లాడుతూ పర్యావరణం వివిధ కారణాల వల్ల కాలుష్యానికి గురవుతోందని, అది మానవాళికి చాలా ఇబ్బందికరమన్నారు. వివిధ రకాల వ్యాధుల బారిన పడాల్సి వస్తోందన్నారు. పర్యావరణ పరిరక్షణను ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా తీసుకోవాలన్నారు. ఐటీసీ వావ్ ప్రతినిధులు శ్రావణ్‌రాజు, వెంకట్, దిలీప్ మాట్లాడుతూ ప్రకృతి వనరుల దుర్వినియోగం వల్ల అంతరించే స్థాయికి వెళ్లాయని, సహజ వనరులైన నీరు, గాలి, ఆకాశం, భూమి కాలుష్యం బారిన పడి మనిషి మనుగడ ప్రమాదంలో పడిందన్నారు. భావితరాలకు మంచి ప్రకృతిని అందివ్వడానికి, సమాజాన్ని చైతన్యం చేసేందుకు పర్యావరణ దినోత్సవం జరుపుకుంటామని చెప్పారు.

అంగన్‌వాడీ కేంద్రంలో పర్యావరణ దినోత్సవం

మద్దిలపాలెం: పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని అంగన్‌వాడీ టీచర్లు, సిబ్బంది పిలుపునిచ్చారు. 51వ వార్డు గాంధీనగర్ అంగన్‌వాడీ కేంద్రంలో పర్యావరణ దినోత్సవాన్ని చిన్నారులతో ఘనంగా నిర్వహించారు. అంగన్‌వాడీ టీచర్ మౌలాబీబీ, మహిళా సంరక్షణ కార్యదర్శి వరలక్ష్మి మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించడం ద్వారా పర్యావరణాన్ని కాపాడుకోవచ్చున్నారు. ప్లాస్టిక్ వ్యర్థాలతో జీవరాశికి కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ వినియోగాన్ని మానుకోవాలని విజ్ఞప్తి చేశారు.



మొక్కలు నాటుతున్న రామకృష్ణారెడ్డి, కర్రి రమారెడ్డి, సుకుమార్ తదితరులు

ప్లాస్టిక్‌ను విడనాడండి

తాటిచెట్లపాలెం: ప్లాస్టిక్‌ను విడనాడండి.. పర్యావరణాన్ని పరిరక్షించండి అని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు సత్తి రామకృష్ణారెడ్డి, కర్రి రమారెడ్డి పిలుపునిచ్చారు. కంచరపాలెం ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో త్రీస్టార్ వాకర్స్ క్లబ్ సిల్వర్ జోనర్, క్లబ్ గౌరవ అధ్యక్షుడు పెతకంశెట్టి సుకుమార్, అధ్యక్షులు జె.ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో వారు మొక్కలు నాటారు. అనంతరం కాటన్ బ్యాగులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కార్యదర్శి కాళ్ల వెంకటప్రసాద్, జె.రమేష్‌కుమార్, కిషోర్ కుమార్, ఇమ్మానుయేల్, ఎస్.సూర్యారావు, కమిటీ, బోర్డు కో–ఆర్డినేషన్ సభ్యులు పాల్గొన్నారు.

వాల్తేర్ డివిజన్ పరిధిలో ప్రత్యేక కార్యక్రమాలు

తాటిచెట్లపాలెం: ఈస్ట్ కోస్ట్ రైల్వే వాల్తేర్ డివిజన్ పరిధిలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ప్లాస్టిక్ కాలుష్యాన్ని తరిమికొడదాం నినాదంతో ప్లాస్టిక్ కాలుష్యం వల్ల కలిగే అనర్థాలు, దీనిని నివారించాల్సిన ఆవశ్యకతను తెలియజేస్తూ డివిజన్ పరిధిలో అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. మే 22 నుంచి జూన్ 5 వరకు డివిజన్ పరిధిలోని దువ్వాడ, శ్రీకాకుళం రోడ్, కోరాపుట్, విజయనగరం, సింహాచలం, జగదల్‌పూర్, కిరండూల్ ప్రాంతాల్లో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు, పోస్టర్ల ప్రదర్శనలు, పారిశుద్ధ్య డ్రైవ్‌లు నిర్వహించారు. కార్యక్రమ ముగింపు సందర్భంగా గురువారం డాల్ఫిన్ నోస్ కాలనీతో సహా పలు రైల్వే కాలనీల్లో అధికారులు మొక్కలు నాటారు. ఈకార్ప్ ప్రెసిడెంట్ జ్యోత్స్న బోరా, వైస్ ప్రెసిడెంట్ మధుస్మిత సాహూ, సెక్రటరీ అంకిత శర్మ, ఏడీఆర్ఎం మనోజ్‌కుమార్ సాహూ, చీఫ్ మెడికల్ ఆఫీసర్(రైల్వే హాస్పిటల్) డాక్టర్ సి.శరత్‌బాబు, రైల్వే అధికారులు పాల్గొన్నారు.

ఈపీడీసీఎల్ కార్యాలయంలో..

సీతమ్మధారలోని ఏపీఈపీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయ ప్రాంగణంలో అధికారులు మొక్కలు నాటారు. కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్లు డి.చంద్రం, టి.వి.సూర్యప్రకాష్, సీజీఎంలు డి.సుమన్ కల్యాణి, వి.విజయలలిత. జె.శ్రీనివాసరావు, అచ్చి రవికుమార్, ఎస్.హరిబాబు, బి.అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సీతమ్మధార రైతుబజార్‌లో..

సీతమ్మధార రైతుబజార్‌లో పర్యావరణానికి హానిచేసే ప్లాస్టిక్ వద్దు – గుడ్డ సంచులు ముద్దు అనే నినాదంతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో జీవీఎంసీ, సచివాలయం, రైతుబజార్‌ల సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి

మురళీనగర్: మురళీనగర్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన పర్యావరణ దినోత్సవంలో జీవీఎంసీ జోన్–5 కమిషనర్ బొడ్డేపల్లి రాము పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖాళీ స్థలాల్లో మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. ఇంటి వద్ద కనీసం కరివేపాకు, తులసి, గోరింటాకు, పుదీనా వంటి చిన్న మొక్కలు నాటడం ద్వారా మంచి వాతావరణాన్ని సృష్టించవచ్చన్నారు. ప్లాస్టిక్‌కు బదులు నార, గుడ్డ సంచులను వాడాలని సూచించారు. ముందుగా నిర్వహించిన పర్యావరణ పరిరక్షణ ర్యాలీలో జెడ్పీ పాల్గొన్నారు. అనంతరం వాకర్స్ పార్కులో జామ, కరివేపాకు, మారేడు, మామిడి తదితర 20 రకాల మొక్కలు నాటారు. క్లబ్ అధ్యక్షుడు సనపల భానుప్రకాష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వాకర్స్ డిస్ట్రిక్ట్–101 గవర్నర్ కె.ద్వారకానాథ్, వైశాఖి స్పోర్ట్స్ పార్కు అధ్యక్షుడు సనపల వరప్రసాద్, ఆర్‌సీ–5 యు.శుభ, వనితా వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు పి.ప్రభావతి, వాకర్స్ క్లబ్ కార్యదర్శి సిహెచ్.ప్రసాదరావు, పూర్వ కార్యదర్శి సెల్వరాజు, ఉపాధ్యక్షురాలు జి.విజయలక్ష్మి, సంయుక్త కార్యదర్శి ఎన్.ప్రకాశరావు, కార్యవర్గ సభ్యులు, జీవీఎంసీ సిబ్బంది పాల్గొన్నారు.

అందరి సహకారం అవసరం

ప్లాస్టిక్ వస్తువులను నిషేధించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ ఇన్‌స్టిట్యూట్(గైస్) ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ కోరారు. గైస్‌లో సేఫ్టీ అండ్ ఎన్విరాన్‌మెంట్ ఇండస్ట్రియల్‌పై సెమినార్ నిర్వహించారు. బీట్ ద ప్లాస్టిక్ పొల్యూషన్ అనే అంశంపై ఆయన వివరణాత్మకంగా మాట్లాడారు. అనంతరం గైస్ ఆవరణలో మొక్కలు నాటారు. విశ్రాంత కెమికల్ ఇంజినీరింగ్ హెడ్ డాక్టర్ బి.వి.లక్ష్మణరావు, సేఫ్టీ కో ఆర్డినేటర్ వి.శ్రీకాంత్, ఎస్‌జే ఇంజినీరింగ్ కన్సల్టెంట్ అండ్ ఈహెచ్ ఆడిటర్ కంట్రోలర్ జయంతి లచ్చయ్య, ఎ.వరహాలు, ప్లాస్టిక్ అండ్ పాలిమర్స్ విభాగాధిపతి వై.వేణుమాధవ్, సీనియర్ లెక్చరర్లు డి.దామోదర్, ఎస్.పి.కుమారి, ఎన్ఎన్‌వీ కుమారి, డాక్టర పి.కృష్ణారెడ్డి, కోటేశ్వరరావు, ఎస్.వి.రమణ పాల్గొన్నారు.



పర్యావరణ దినోత్సవంలో పాల్గొన్న సంస్థ ప్రతినిధులు, విద్యార్థులు

నార సంచుల పంపిణీ



నార సంచులు పంపిణీ చేస్తున్న శుభోదయం వాకర్స్ క్లబ్ ప్రతినిధులు



ప్రతిజ్ఞ చేస్తున్న అబిద్‌నగర్ వాసులు

సీతంపేట: పర్యావరణ దినోత్సవం సందర్భంగా అక్కయ్యపాలెం అబిద్‌నగర్ పార్కులో శుభోదయం వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం 300 జనపనార సంచులు ఉచితంగా పంపిణీ చేశారు. మూడు రోజులుగా ఈ ప్రాంత ప్రజలకు, వాకర్స్‌కు పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. సింగిల్ యూజ్ పాలిథిన్ బ్యాగుల వినియోగం వల్ల కలిగే అనర్థాలు వివరించారు. ప్లాస్టిక్ వ్యతిరేక ప్రతిజ్ఞ చేయించి నార సంచితోపాటు ప్రతిజ్ఞ కరపత్రం అందజేసారు. కార్యక్రమంలో వాకర్స్ క్లబ్ సభ్యులు, అబిద్‌నగర్ వాసులు పాల్గొన్నారు.

కాలుష్య నియంత్రణకు మొక్కలు నాటుదాం

మద్దిలపాలెం: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పెంచే బాధ్యత తీసుకోవాలని ఏపీఎస్‌ఆర్టీసీ విశాఖ జిల్లా ప్రజా రవాణా శాఖాధికారి బి.అప్పలనాయుడు పిలుపునిచ్చారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గురువారం ఆయన అధ్వర్యంలో జిల్లాలోని అన్ని డిపోల్లో అధికారులు, సిబ్బందితో కలిసి మొక్కలు నాటే కార్యక్రమాలు నిర్వహించారు. మద్దిలపాలెం డిపో ఆవరణలో ముఖ్య అతిథిగా ఆయన మొక్కలు నాటారు. ఈ సందర్భంగా అప్పలనాయుడు మాట్లాడుతూ విశాఖను కాలుష్య రహిత నగరంగా తీర్చిదిద్దడానికి ప్రతి ఒక్కరూ కనీసం ఒక్క మొక్కయినా నాటాలన్నారు. బస్సుల కండిషన్‌ను మెరుగుపరచాలని, బస్సుల ఇంజెక్టర్స్, టిన్స్ మొదలగు సామగ్రిని ఎప్పటికప్పుడు మార్చాలని సిబ్బందికి సూచించారు. బ్రేకులు, టైర్లను ఎప్పటికప్పుడు బాగుచేయాలని, తద్వారా కాలుష్యాన్ని కొంతమేరైనా తగ్గించవచ్చన్నారు. అనంతరం మద్దిలపాలెం డిపో సిబ్బందికి పనిముట్లు అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ చీఫ్ మెకానికల్ ఇంజినీర్ కె.రాజశేఖర్, డిపో మేనేజర్ కె.గంగాధర్, అసిస్టెంట్ మెకానికల్ ఇంజినీర్లు రామకృష్ణ, నాయుడు, అసిస్టెంట్ మేనేజర్ అప్పారావు, సిబ్బంది పాల్గొన్నారు.



మద్దిలపాలెం డిపో సిబ్బందికి పనిముట్లు అందిస్తున్న ఆర్టీసీ అధికారి అప్పలనాయుడు

విద్యార్థులకు వక్తృత్వ పోటీలు

మురళీనగర్: మాధవధార మహిళా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో లిటిల్ పెంగ్విన్స్ గ్లోబల్ స్కూల్ సౌజన్యంతో పర్యావరణ దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు గురువారం వక్తృత్వ పోటీలు నిర్వహించారు. క్లబ్ అధ్యక్షురాలు కె.మాధవి పర్యవేక్షణలో జరిగిన ఈ పోటీల్లో వాతావరణ కాలుష్య నియంత్రణ–మన బాధ్యత అనే అంశంపై విద్యార్థులు ప్రసంగించారు. సుష్మ, దర్శ శిరీష న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. జిల్లా–101 గవర్నర్ కె.ద్వారకానాథ్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలని సూచించారు. ప్లాస్టిక్ నిషేధానికి సహకరించాలన్నారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన హవీష్, సైఫ్ ఆలీ, హర్షిణిలతోపాటు ఇద్దరికి కన్సొలేషన్ బహుమతులు అందించారు. పిల్లలకు అల్పాహారం, శీతల పానీయాలు అందజేశారు. లిటిల్ పెంగ్విన్స్ గ్లోబల్ స్కూల్ వ్యవస్థాపకులు మహేష్, సుష్మ, వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు ఎస్.భానుప్రకాష్, కార్యదర్శి ప్రసాదరావు, మహిళా వాకర్స్ క్లబ్ ఉపాధ్యక్షురాలు సిహెచ్.వరలక్ష్మి, జాలీ వాకర్ కె.సుగుణ, బోర్డర్ డైరెక్టర్స్ మహాలక్ష్మి, సుమలత పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందిస్తున్న మహిళా వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు మాధవి

అల్లుకున్న పొదులు.. కానరాని వెలుగులు

- కైలాసపురం ప్రధాన రహదారిలో చీకట్లు
- విద్యుత్ స్తంభాల పైకి ఎగబాకిన చెట్లు, పిచ్చిమొక్కల తీగలు
- చాలా చోట్ల వెలగని లైట్లు
- రాత్రి వేళల్లో ప్రయాణికుల తంటాలు

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ పరిధి కైలాసపురం–మాధవధార వుడా కాలనీ మెయిన్ రోడ్డులో రాత్రయితే చీకట్లు అలుముకుంటున్నాయి. ఈ మార్గంలోని విద్యుత్ స్తంభాలను చెట్లు, పిచ్చిమొక్కల తీగలు పూర్తిగా అల్లుకుని మూసివేశాయి. దీంతో రాత్రి వేళల్లో విద్యుత్ లైట్ల వెలుగులు కనిపించక పోవడంతో స్థానికులు, వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా డీఎల్‌బీ గ్రౌండ్స్, డీఎల్‌బీ క్వార్టర్స్, మధుసూదన నగర్, సీఐఎస్ఎఫ్ క్వార్టర్స్ మార్గంలో చాలా చోట్ల విద్యుత్ లైట్లు వెలగడం లేదు. కొన్ని చోట్ల లైట్లే లేవు. కొన్ని చోట్ల ఉన్నా.. అవి వెలగడం లేదు. దీంతో రాత్రయితే ఈ మార్గంలో ప్రయాణించడానికి జనం భయపడుతున్నారు. కొన్నిసార్లు ఈ మార్గంలో ఆకతాయిల వల్ల కూడా ఆందోళనకు గురవుతున్నారు. పగలు, రాత్రి వేళల్లో ఇక్కడే బహిరంగంగా మద్యం తాగడం, రోడ్లపైనే బైక్‌లతో భయభ్రాంతులకు గురిచేయడం వంటివి చేస్తున్నారు. విధులు ముగించుకుని ఇళ్లకు వెళ్లే వారు వీరి ఆగడాలతో ఇబ్బందులు పడుతున్నారు. ఈ పరిసర ప్రాంతాల్లో చాలా కాలనీలు ఉండటంతో ఉదయం నుంచి సుమారు రాత్రి 11 గంటల వరకు ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. ఈ ప్రాంతంలో రాత్రి వేళల్లో సరైన విద్యుత్ లైటింగ్ లేకపోవడంతో భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు.

ఫిర్యాదులు పట్టని అధికారులు

మధుసూదన నగర్ నుంచి సీఐఎస్ఎఫ్ క్వార్టర్స్ వరకు ఉన్న కొన్ని స్ట్రీట్ లైట్లు వెలుగుతున్నా.. ప్రయోజనం లేదు. విద్యుత్ దీపాల స్తంభాల మీదకు పిచ్చిపొదులు, మొక్కలు విస్తారంగా ఎగబాకాయి. దీంతో కనీసం లైటు వెలుగుతున్నా ఏమాత్రం కనిపించడం లేదు. విద్యుత్ స్తంభాలకు అల్లుకున్న చెట్ల తీగలు ప్రమాదకరంగా మారాయని పలువురు స్థానికులు, ప్రయాణికులు చెబుతున్నారు. ఈ సమస్యపై అధికారులకు ఫిర్యాదులు చేస్తున్నా.. చర్యలు తీసుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి కైలాసపురం ప్రధాన రహదారిలో విద్యుద్దీప వెలుగులు సక్రమంగా ప్రసరించేలా చర్యలు చేపట్టాలని స్థానికులు, వాహన చోదకులు కోరుతున్నారు.



కైలాసపురం డీఎల్‌బీ క్వార్టర్స్ సమీపంలో వెలగని విద్యుత్ లైట్





సీఐఎస్ఎఫ్ క్వార్టర్స్ వద్ద విద్యుత్ స్తంభాల పైకి ఎగబాకిన చెట్ల పొదులు

తప్పిపోయిన వ్యక్తి కుటుంబం చెంతకు..

విశాఖ విద్య: మానసిక స్థితి సరిగ్గా లేక, ఇంటి నుంచి తప్పిపోయి వచ్చిన వ్యక్తిని ఎట్టకేలకు వారి కుటుంబం చెంతకు చేర్చారు. వివరాలివి.. కొన్ని రోజుల కిందట కంచరపాలెం ఫుట్‌పాత్ మీద దుస్తులు లేకుండా, మానసిక పరిస్థితి బాగాలేక తిరుగుతున్న వ్యక్తిని స్థానికుల సమాచారంతో 90వ వార్డులోని జీవీఎంసీ షెల్టర్‌కు తరలించారు. అతడి ఆరోగ్య పరిస్థితి సరిగా లేనందున, కంచరపాలెం పోలీసుల సమక్షంలో స్థానిక మెంటల్ కేర్ హాస్పిటల్‌లో చికిత్స చేయించారు. తన పేరు దేవేంద్ర అని, తనది తెలంగాణలోని వేములవాడ గ్రామమని చెప్పడంతో.. షెల్టర్ మేనేజర్ ఎల్లేటి మమత వేములవాడలో తనకు తెలిసిన వారికి దేవేంద్ర విషయం తెలియజేశారు. దేవేంద్ర ఫొటోను వాట్సాప్ ద్వారా పంపించడంతో వారి కుటుంబ సభ్యులు గుర్తించి.. విశాఖపట్నం వచ్చారు. హాస్పిటల్ సూపరింటెండెంట్ సహాయంతో దేవేంద్రను గురువారం మెంటల్ కేర్ హాస్పిటల్ నుంచి డిశ్చార్జి చేయించి, అతడి తల్లికి అప్పగించడంలో షెల్టర్ మేనేజర్ మమత ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. వారు ఆమెకు కృతజ్ఞతలు తెలిపారు.



కుటుంబ సభ్యులకు దేవేంద్రను అప్పగిస్తున్న మమత